తొలిరోజే 19 వేల మంది గైర్హాజరు

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ప్రారంభం

నిమిషం నిబంధనతో నష్టపోయిన పలువురు విద్యార్థులు

నేటి నుంచి సెకండియర్ పరీక్షలు ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ వార్షిక పరీక్షల తొలిరోజే విద్యార్థులు భారీగా డుమ్మాకొట్టారు. ఏకంగా 19 వేల మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారం ఫస్టియర్ విద్యార్థులకు రెండోభాష పేపర్ -1 పరీక్ష నిర్వహించారు. మొత్తం 5,07,754 మంది విద్యార్థులకు 4,88,113 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. దీని లెక్కన 19, 641 (3.86శాతం) మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. మూడు సెట్ల ప్రశ్నపత్రాలను పరీక్షాకేంద్రాలకు పంపించగా, తొలిరోజు 'ఏ' సెట్ పేపర్‌ను ఎంపికచేశారు. ఇక గురువారం నుంచి సెకండియర్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి.

మూడు మాల్ ప్రాక్టీస్ కేసులు

పరీక్షలు ప్రారంభమైన తొలిరోజే మూడు మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. కరీంనగర్, నిజామాబాద్, జనగామ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున మాల్ ప్రాక్టీస్ కేసులను అధికారులు నమోదుచేశారు. విద్యార్థులు చిట్టీలు తీసుకొచ్చి పరీక్షరాస్తుండగా, గుర్తించిన అధికారులు వారిని పరీక్షరాయనీయకుండా పంపించివేశారు.

నిమిషం నిబంధనతో..

పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని అధికారులు ముందే హెచ్చరించారు. అయినా తొలిరోజు పలువురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చి పరీక్షరాసే అవకాశం కోల్పోయారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల సెంటర్‌లో ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా రాగా, అధికారులు అనుమతించకపోవడంతో విద్యార్థులు వెనుదిరగాల్సి వచ్చింది. హైదరాబాద్ మహబూబియా కళాశాల పరీక్షకేంద్రంలో ఒక విద్యార్థి ట్రాఫిక్ కారణంగా ఆలస్యం కావడంతో అధికారులు పరీక్షకు అనుమతించలేదు. ధర్మపురి మండల కేంద్రంలో ఓ బాలిక 9.09 నిమిషాలకు పరీక్షకేంద్రానికి రాగా, అధికారులు వెనక్కి పంపించారు. దీంతో సదరు విద్యార్థి కన్నీటిపర్యంతమైంది. ఆలస్యంగా వచ్చిన విద్యార్థుల రోదనలు, బ్రతిమాలడాలు పలువురిని కదిలించాయి.

సెల్‌ఫోన్లను అనుమతించొద్దు : బుర్రా వెంకటేశం

ఇంటర్ పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్లను అనుమతించొద్దని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం అధికారులను ఆదేశించారు. పరీక్షలు ప్రారంభమైన సందర్భంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీచైతన్య కళాశాల పరీక్షాకేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మార్చి 26 వరకు సీయూ ఈటీ (యూజీ) దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : సీయూఈటీ (యూజీ) దరఖాస్తులను మార్చి 26 వరకు స్వీకరిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది. మూడేండ్లుగా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థల్లోని అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలను సీయూఈటీ స్కోర్ ఆధారంగానే భర్తీ చేస్తున్నారు.

సీయూఈటీ (యూజీ) షెడ్యూల్ ఇలా..

దరఖాస్తుల స్వీకరణ	27 ఫిబ్రవరి నుంచి మార్చి 26 వరకు
ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు	26 మార్చి
దరఖాస్తుల్లో తప్పుల సవరణ	28, 29 మార్చి
సిటీ ఇన్ఫర్మేషన్ స్లిప్ విడుదల	30 ఏప్రిల్
అడ్మిట్‌కార్డుల విడుదల	మే రెండో వారంలో
పరీక్షలు	మే 15 నుంచి 31 వరకు

హైదరాబాద్‌లో అమెరికన్ ప్రీస్కూల్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : వేల కోట్లు పెట్టుబడులను స్వాగతిస్తూ.. అనేకానేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, కంపెనీలకు నెలవుగా ఉన్న హైదరాబాద్ ఇప్పుడు అమెరికన్ స్కూళ్లను ఆకర్షిస్తున్నది. ఇప్పటికే గూగుల్, అమెజాన్ వంటి సంస్థలు హైదరాబాద్‌కు తరలిరాగా, తాజాగా ఓ అమెరికన్ స్కూల్ హైదరాబాద్‌లో ఏర్పాటైంది. గచ్చిబౌలిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటుచేసిన సఫారీకిడ్ ప్రీ స్కూల్, డేకేర్ సెంటర్‌ను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని బుధవారం ప్రారంభించారు. సఫారీకిడ్ ప్రీస్కూల్‌ను 2005లో సిలికన్ వ్యాలీలో తీసుకొచ్చారు. ఆ తర్వాత అమెరికా, కెనడా వరకు విస్తరించిన ఈ స్కూల్ ఇప్పుడు మన దేశంలోని హైదరాబాద్‌లో పాఠశాలను నెలకొల్పింది. వచ్చే విద్యాసంవత్సరం వరకు దేశంలోని 10 ప్రముఖ పట్టణాల్లో ఈ స్కూల్‌ను నెలకొల్పుతామని సఫారీ కిడ్ ఇండియా చైర్మన్ జితేంద్ర కర్సన్ తెలిపారు.

జీవన ప్రమాణాల పెంపునకు సైన్స్ దోహదం

నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ గ్రెగ్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 28 : సైన్స్ మానవ జీవన ప్రమాణాల పెంపునకు దోహదపడుతుందని నోబెల్ బహుమతి గ్రహీత, జెనెటిక్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ గ్రెగ్ ఎల్ సెమెంజాతొ అన్నారు. ఎన్నో ఆవిష్కరణలకు బాటలు వేసిన సైన్స్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ గీతం డీమ్డ్ వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో సెమెంజాతొ మాట్లాడుతూ.. సృజనాత్మకతతో ప్రయోగాలను ఆవిష్కరించాలని చెప్పారు. శరీర కణాలు ఆక్సిజన్‌ను ఎలా అందజేస్తున్నాయో అర్థం చేసుకోవాలని.. ఆ ఆక్సిజన్ స్థాయిలను నియంత్రిస్తున్న ప్రొటీన్ హెపైక్సియా ప్రేరేపించగల కారకాన్ని కనుగొనడానికి చేపట్టిన సంచలనాత్మక పరిశోధన తనకు నోబెల్ బహుమతి తెచ్చిపెట్టిందని వివరించారు. ఈ సందర్భంగా గ్రెగ్‌ను డీఎస్‌టీ కార్యదర్శి డాక్టర్ ఎస్ చంద్రశేఖర్, గీతం అదనపు కులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు సత్కరించారు. కార్యక్రమంలో ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్, కానరీ ది గ్లోబల్, డీపీఎస్ మియాపూర్, శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్, కీసర పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్, జెనెసిస్ స్కూళ్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ గ్రెగ్‌ను సన్మానిస్తున్న చంద్రశేఖర్, రావు

పెండింగ్ టీచర్ పోస్టుల ఫలితాలు వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): పాఠశాల విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న టీచర్ పోస్టుల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. కోర్టు కేసుల వల్ల చాలాకాలంగా నిలిచిపోయిన స్కూల్ అసిస్టెంట్, సోషల్ స్టడీస్ (తెలుగు మీడియం) ఉద్యోగాలకు ఐదుగురు అభ్యర్థులు ఎంపికైనట్టు టీఎస్‌పీఎస్సీ అధికారులు తెలిపారు. కోర్టులో ఉన్న కేసులు క్లియర్ కావడంతో ఈ నిర్ణయం తీసుకొన్నారు. ముగ్గురు ఎస్జీటీ తెలుగు మీడియం అభ్యర్థులను కూడా ఎంపిక చేసినట్టు వెల్లడించారు. ఫలితాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు పేర్కొన్నారు. విద్యాశాఖలో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి 2017లో నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

నిమిషం నిబంధన..

పరీక్ష రాయని విద్యార్థులు

నాగర్‌కర్నూల్ పరీక్షా కేంద్రంలో ఓ విద్యార్థినికి అస్వస్థత

సిద్దిపేట/నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 28: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల హాజరుకు సంబంధించి అధికారులు నిమిషం నిబంధన అమలు చేయడంతో.. బుధవారం ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షను ఇద్దరు విద్యార్థులు రాయలేకపోయారు. సిద్దిపేట జిల్లాలో తొలిరోజు 11,039 మంది విద్యార్థులకుగానూ 10,328 మంది పరీక్షకు హాజరయ్యారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి ఇద్దరు విద్యార్థులు 10 నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. దీంతో ఆ విద్యార్థులను అధికారులు లోపలికి అనుమతించలేదు. చేసేది లేక విద్యార్థులు నిరాశతో వెనుదిరిగారు. కాగా.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఓ విద్యార్థిని స్వల్ప అస్వస్థతకు గురైంది. బిజినేపల్లి మండలం సల్కర్‌పేట గ్రామానికి చెందిన మల్లీశ్వరి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాసేందుకు తనకు కేటాయించిన బాలుర కళాశాలకు చేరుకున్నది. పరీక్షా హాల్‌లోకి వెళ్లిన కొద్దిసేపటికే కడుపునొప్పితో బాధపడుతున్నది. దీనిని గుర్తించిన ఇన్విజిలేటర్లు అంబులెన్స్‌లో జిల్లా జనరల్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స అనంతరం తిరిగి పరీక్షా హాల్‌లోకి అనుమతించారు.

ఎమర్జింగ్ కోర్సులకూ రాం రాం

సీఎస్‌ఈలో విలీనానికి జేఎన్టీయూకు దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ తదితర కోర్ కోర్సుల తరహాలోనే కొన్ని ఎమర్జింగ్ కోర్సులకు పలు కాలేజీలు గుడ్‌బై చెప్తున్నాయి. ఒకే విభాగంలోని అనుబంధ కోర్సుల విలీనానికి ఏఐసీటీఈ పచ్చజెండా ఊపిన నేపథ్యంలో పలు కాలేజీల ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ ఏడాది 140 ఇంజినీరింగ్ కాలేజీలు కోర్సుల విలీనం లేదా సీట్లు పెంచుకునేందుకు అనుమతివ్వాలని కోరుతూ జేఎన్టీయూకు దరఖాస్తు చేసుకున్నాయి. ఎమర్జింగ్ కోర్సులుగా పేరొందిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలోని ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), సైబర్ సెక్యూరిటీ, డాటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ వంటి కోర్సులను వదిలేసి ఆయా సీట్లను సీఎస్‌ఈలో విలీనం చేస్తున్నాయి. దీంతో పలు కాలేజీల్లో ఆయా కోర్సుల్లో ఫస్టియర్ సీట్లు జీరో కానున్నాయి. ఒక కాలేజీలో సీఎస్‌ఈ ఐవోటీ కోర్సులో 60, సీఎస్‌ఈలో 180 సీట్లు ఉన్నాయి. ఆ కాలేజీ ఐవోటీలోని 60 సీట్లను సీఎస్‌ఈలో విలీనం చేసేందుకు దరఖాస్తు చేసింది. ఇందుకు అనుమతిస్తే సీఎస్‌ఈలో సీట్లు 240కి పెరుగుతాయి. ఐవోటీలో సీట్లు సున్నా అవుతాయి. మరో కాలేజీ ఐటీ కోర్సులో ఉన్న 90 సీట్లల్లో 60 సీట్లను సీఎస్‌ఈలో విలీనం చేసేందుకు దరఖాస్తు సమర్పించింది.



డీఎల్ అభ్యర్థుల తుది జాబితా విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): గురుకుల డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) విడుదల చేసింది. సబ్జెక్టుల వారీగా ఎంపికైన అభ్యర్థుల హాల్ టికెట్ల నంబర్లను ట్రిబ్ సైట్‌లో పొందుపర్చినట్టు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఇటీవలే డీఎల్, జేఎల్